# వృద్ధికి టారిఫ్ దెబ్బ



## మళ్లీ పెరిగిన పుత్తడి

న్యూఢిల్లీ, మే 2: బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లకు తోడు దేశీయంగా ఆభరణాలకు డిమాండ్ అధికంగా ఉండటంతో దేశీయంగా పుత్తడి ధర రూ.96 వేల మార్కును అధిగమించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పది గ్రాముల బంగారం ధర రూ.1,080 ఎగబాకి రూ.96,800 పలికింది. గురువారం భారీగా తగ్గిన ధరలు మళ్లీ ఆ మరుసటి రోజే పెరగడం విశేషం. స్థానిక ఆభరణాల వర్తకుల కొనుగోళ్లకు మొగ్గుచూపడం, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ అధికంగా ఉండటం ధరలు పెరగడానికి ప్రధాన కారణమని ట్రేడర్ వెల్లడించారు. పసిడితోపాటు కిలో వెండి రూ.1,600 ఎగబాకి రూ.97,100 పలికింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 23.10 డాలర్లు పెరిగి 3,262.30 డాలర్లకు చేరుకోగా, వెండి 32.49 డాలర్లుగా ఉన్నది.

## ఆడీ కార్లు ప్రియం


న్యూఢిల్లీ, మే 2: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ ఇండియా మరోసారి ధరలను పెంచబోతున్నట్లు ప్రకటించింది. ఈ నెల 15 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల మోడళ్ల ధరలను రెండు శాతం వరకు సవరిస్తున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం అధికం కావడంతోపాటు ఎక్స్ఛేంజ్ రేట్లలో మార్పులు చోటు చేసుకోవడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని తెలిపింది.

## విక్రయదారులకు అమెజాన్ దన్ను

హైదరాబాద్, మే 2: దేశవ్యాప్తంగా ఉన్న చిన్న స్థాయి విక్రయదారులకు అమెజాన్ శుభవార్తను అందించింది. రూ.300 కంటే తక్కువ ధర కలిగిన ఉత్పత్తులపై రెఫరల్ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో విక్రయదారులు తక్కువ ధర కలిగిన వస్తువులపై గణనీయమైన రీతిలో పొదుపు చేసుకునేందుకు అవకాశం లభించనున్నదని అమెజాన్ ఇండియా సేల్స్ డైరెక్టర్ గౌరవ్ భట్నాగర్ తెలిపారు. దుస్తులు, బూట్లు, ఫ్యాషన్ నగలు, గృహోపకరణాలు, వంటగదికి సంబంధించి 135కి పైగా రంగాలకు చెందిన ఉత్పత్తులకు ఈ నిర్ణయం వర్తించనున్నది. తెలంగాణ నుంచి 50 వేల మంది విక్రయదారుల నుంచి సేకరించి తమ ఉత్పత్తులను అమెజాన్‌లో విక్రయిస్తున్నాయి.

**ఈ ఆర్థిక సంవత్సరానికిగాను జీడీపీ అంచనాను తగ్గించిన ఎస్అండ్‌పీ**

- **6.5 శాతం నుంచి 6.3 శాతానికి కోత**
- **ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రభావం**
- **ఈ ఏడాది ఆఖరుకల్లా 88 స్థాయికి రూపీ పతనం!**




న్యూఢిల్లీ, మే 2: భారత జీడీపీ అంచనాలకు ప్రముఖ గ్లోబల్ రేటింగ్స్ ఏజెన్సీ ఎస్అండ్‌పీ కోత పెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను దేశ వృద్ధిరేటు 6.3 శాతంగానే ఉండొచ్చని శుక్రవారం పేర్కొన్నది. ఇంతకుముందు అంచనా 6.5 శాతంగా ఉండటం గమనార్హం. 'ప్రపంచ స్థూల ఆర్థిక వ్యవస్థ సమాచారం: ఆర్థిక వృద్ధిని నెమ్మదింపజేస్తున్న అమెరికా వాణిజ్య విధానంలోని భారీ మార్పులు' పేరిట ఓ నివేదికను ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ తాజాగా విడుదల చేసింది. ఈ సందర్భంగానే గతంలో భారత ఆర్థిక వ్యవస్థ ప్రగతికి సంబంధించి పేర్కొన్న అంచనాలను సవరించింది.

### ట్రంప్ సుంకాల సెగ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలను తెరలేపడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి వాతావరణం నెలకొన్నది. అయితే చైనా మినహా మిగతా దేశాలపై విధిస్తామన్న టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపివేయడం కొంతలోకొంత ఊరటనిచ్చింది. ఈ క్రమంలోనే భారత్‌సహా ఆయా దేశాలు.. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకునే పనిలోపడ్డాయి. అయినప్పటికీ ఈ ట్రేడ్ వార్‌పై అనిశ్చిత పరిస్థితులు ఇంకా కొనసాగుతూనే ఉండటంతో.. ఆ సెగ ఇప్పుడు దేశ జీడీపీ అంచనాకు తాకింది. నిజానికి ఈ ఏడాది మార్చిలోనే దేశ వృద్ధిరేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 6.5 శాతంగానే ఉండొచ్చని ఎస్అండ్‌పీ అంచనా వేసింది. అంతకుముందు ఇది 6.7 శాతంగా ఉంటుందన్నది. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో 0.2 శాతం మేర తగ్గిస్తూ ప్రకటించింది. ఈ లెక్కన చూసుకుంటే జీడీపీ అంచనాకు దాదాపు అర శాతం కత్తెర పడినట్టే అనుకోవచ్చు. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) దేశ జీడీపీ వృద్ధి రేటు 6.5 శాతంగా ఉండొచ్చని ఎస్అండ్‌పీ అంటున్నది.

### రూపాయి అధోగతే..

డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఈ ఏడాది ఆఖరుకల్లా 88 స్థాయికి దిగజారవచ్చని ఎస్అండ్‌పీ ఈ సందర్భంగా తమ రిపోర్టులో పేర్కొన్నది. ప్రస్తుతం 84.57 వద్ద రూపీ వాల్యూ కదలాడుతుండగా.. 2024 చివర్లో 85.64 వద్ద ఉన్న విషయం తెలిసిందే. దీంతో ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకానైతే రూపాయి మారకం విలువ రూపాయికిపైగానే కోలుకున్నట్టు కనిపిస్తున్నది. అయితే గడిచిన ఈ 4 నెలల్లో తీవ్ర ఒడిదొడుకులనూ చవిచూసింది. ఫిబ్రవరి 6న మునుపెన్నడూ లేనివిధంగా 87.59 స్థాయికి క్షీణించింది. ఒకానొక దశలో 87.60 స్థాయినీ తాకింది. ఈ నేపథ్యంలో ఎస్అండ్‌పీ అంచనా మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. మళ్లీ రూపాయి ఒత్తిడికి లోనవబోతున్నదన్న సంకేతాలనిస్తున్నది.

**2025-26కుగాను దేశ జీడీపీ అంచనాలకు కోతలు**

| సంస్థ | ప్రస్తుతం | మునుపు |
|---|---|---|
| ఆర్బీఐ | 6.5% | 6.7% |
| ఫిచ్ | 6.4% | 6.5% |
| ఓఈసీడీ | 6.4% | 6.9% |
| ఎస్అండ్‌పీ | 6.3% | 6.5% |
| ప్రపంచ బ్యాంక్ | 6.3% | 6.7% |
| ఐఎంఎఫ్ | 6.2% | 6.5% |
| మూడీస్(2025) | 6.1% | 6.4% |

- ఈ ఏడాది అమెరికా జీడీపీ వృద్ధిరేటు 1.5 శాతంగా, వచ్చే ఏడాది 1.7 శాతంగా ఉండొచ్చంటున్న ఎస్అండ్‌పీ.
- చైనా జీడీపీ వృద్ధిరేటు ఈ ఏడాది 0.7 శాతం తగ్గి 3.5 శాతానికే పరిమితం కావచ్చు. వచ్చే ఏడాదైతే 3 శాతంగానే ఉండొచ్చని అంచనా.
- అమెరికాతో సుంకాల సమరానికి బదులుగా చాలా దేశాలు వాణిజ్య ఒప్పందాలనే చేసుకునే వీలుందంటున్న ఎస్అండ్‌పీ.
- అమెరికా, యూరప్ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు సంక్లిష్టం కావచ్చు. కఠిన వైఖరికే మొగ్గుచూపుతున్న కెనడా.
- పరస్పర ప్రతీకార సుంకాలతో ఏ దేశానికీ లాభం ఉండదంటున్న ఎస్అండ్‌పీ. ఈ తరహా రక్షణాత్మక ధోరణులు మంచివికావని హితవు.



## టాప్‌గేర్‌లో క్రెటా విక్రయాలు

న్యూఢిల్లీ, మే 2: ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన హ్యుందాయ్‌కు చెందిన ఎస్‌యూవీ మాడల్ క్రెటా మరో మైలురాయిని సాధించింది. వరుసగా రెండో నెల ఏప్రిల్‌లోనూ అత్యధికంగా అమ్ముడైన వాహనాల్లో తొలిస్థానంలో నిలిచింది. గత నెలలో 17 వేల యూనిట్ల క్రెటా వాహనాలు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన దాంతో పోలిస్తే 10 శాతం వృద్ధిని కనబరిచాయి. సంస్థ మొత్తంగా 69,914 యూనిట్ల వాహనాలను విక్రయించగా, వీటిలో ఎస్‌యూవీ వాటా 71 శాతంగా ఉన్నదని పేర్కొంది. ఈ వాహనంపై కస్టమర్లు పెట్టుకున్న నమ్మకానికి ఇది నిదర్శనమని కంపెనీ సీవోవో, డైరెక్టర్ తరుణ్ గార్గ్ తెలిపారు. క్రెటాతోపాటు వెన్యూ, ఎక్స్‌టర్, అల్కాజర్, ఇతర మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది. పదేండ్ల క్రితం దేశీయ రోడ్లపైకి అందుబాటులోకి వచ్చిన ఈ మాడల్‌కు 12 లక్షల మంది కస్టమర్లు ఉన్నారు.

## అమెరికాలో మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్లు

- **యాపిల్ సీఈవో టిమ్ కుక్ వెల్లడి**

న్యూఢిల్లీ, మే 2: అమెరికాలో అమ్ముడుకానున్న ఐఫోన్లలో భారత్‌లో తయారైనవే అత్యధికంగా ఉండనున్నాయని యాపిల్ సీఈవో టిమ్ కుక్ వెల్లడించారు. వరుసగా ఏడో త్రైమాసికంలోనూ ఐఫోన్ల అమ్మకాలు తగ్గుముఖం పట్టడంతో సంస్థ ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించింది. ఒకవైపు ప్రతీకార సుంకాలు విధిస్తుండటంతో భారత్‌లో తయారవుతున్న ఐఫోన్లను భారీగా దిగుమతి చేసుకోవాలని చూస్తున్నది సంస్థ. జూన్ త్రైమాసికం నాటికి యూఎస్‌లో అమ్ముడుకానున్న అత్యధిక ఐఫోన్లలో భారత్ నుంచి దిగుమతి చేసుకునేవే ఉండనున్నాయని, అలాగే వియత్నాం నుంచి ఐప్యాడ్, మ్యాక్, యాపిల్ వాచెస్, ఎయిర్‌ప్యాడ్స్ ఉండనున్నాయని చెప్పారు. 2024లో అమెరికాలో 75.9 మిలియన్ల ఐఫోన్లు అమ్ముడయ్యాయి. ఇప్పటికే యునైటెడ్ స్టేట్స్‌కు భారత్ నుంచి అత్యధికంగా ఐఫోన్లు ఎగుమతి అవుతున్నాయని, ఫిబ్రవరితో ముగిసిన మూడు నెలలకాలంలో ఎగుమతులు 82 శాతం పెరిగాయని, ఇదే క్రమంలో మార్చి నాటికి 97.6 శాతానికి చేరుకున్నాయని ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటిలిజెన్స్ తన నివేదికలో వెల్లడించింది. మార్చితో ముగిసిన రెండో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 90.75 బిలియన్ డాలర్ల నుంచి 95.35 బిలియన్ డాలర్లకు చేరుకున్నది.



## కోలుకున్న స్టాక్ మార్కెట్లు

### సెన్సెక్స్ 260, నిఫ్టీ 12 పాయింట్ల లాభం

ముంబై, మే 2: దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడ్డాయి. అమెరికా-భారత్ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలు కుదిరే అవకాశాలుండటం, రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లుకావడం మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. వీటికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఎగబడి కొనుగోళ్లు జరపడం, అంతర్జాతీయ మార్కెట్లు ఆశాజనకంగా ట్రేడవడంతో సూచీలకు ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇంట్రాడేలో 900 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 259.75 పాయింట్లు అందుకొని 80,501.99 వద్ద ముగియగా, మరో సూచీ నిఫ్టీ 12.50 పాయింట్లు పెరిగి 24,346.70 పాయింట్లకు చేరుకున్నది. ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో అదానీ పోర్ట్ షేరు 4 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు బజాజ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎస్బీఐ, మారుతి, టాటా మోటర్స్, ఐటీసీ, టాటా స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభాల్లో ముగియగా..నెస్లె, ఎన్టీపీసీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్, టైటాన్ షేర్లు నష్టపోయాయి. రంగాలవారీగా సర్వీసెస్ 1.67 శాతం అధికంకాగా, ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ, ఐటీ రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించగా..టెలికం, కన్జ్యూమర్ డ్యూరబుల్, పవర్, యుటిలిటీ, మెటల్, రియల్టీ రంగ షేర్లు నష్టపోయాయి.




## సర్కారీ అప్పులు తగ్గాలి

- **అప్పుడే దేశ క్రెడిట్ రేటింగ్ జూమ్**
- **డీఈఏ కార్యదర్శి అజయ్ సేథ్**

న్యూఢిల్లీ, మే 2: దేశ రుణ భారం చాలా ఎక్కువగా ఉందని, ఇది తగ్గాలని.. అప్పుడే గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలు భారత క్రెడిట్ రేటింగ్‌ను పెంచుతాయని ఆర్థిక వ్యవహారాల (డీఈఏ) కార్యదర్శి అజయ్ సేథ్ అన్నారు. ఈ సర్కారీ అప్పులపై చెల్లించే వడ్డీ భారం కూడా మోయలేనివిధంగా తయారవుతున్నదని, దాన్ని దించుకోవాల్సిన అవసరం ఎంతో ఉన్నదనీ ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఐఎస్‌ఏపీసీ సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ కాన్ఫరెన్స్‌లో అజయ్ మాట్లాడుతూ.. అప్పులు పెరుగుతూపోవడం మంచిదికాదన్నారు. రేటింగ్ అప్‌గ్రేడ్ కోసం రేటింగ్ ఏజెన్సీలతో భారత్ ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తోందని వివరించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడానికి మితిమీరిన రుణ భారమేనంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఖర్చులకు సంబంధించి స్పందిస్తూ.. చాలావరకు సమతూకం లోపించిందన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాభివృద్ధి కంటే రుణ నిధులను వ్యయాలను పెంచుకోవడానికే వినియోగిస్తున్నాయన్నారు. కాగా, ట్యాక్స్-టు-జీడీపీ రేషియో 20 శాతానికి చేరాలంటే 5-6 ఏండ్లు పట్టవచ్చన్నారు.

## బ్యాంకులపై ఆర్బీఐ భారీ జరిమానా

ముంబై, మే 2: నాలుగు బ్యాంకులకు రిజర్వు బ్యాంక్ షాకిచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకుగాను ఐసీఐసీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాతోపాటు మరో రెండు బ్యాంకులపై భారీ స్థాయిలో జరిమానా విధించింది. వీటిలో ఐసీఐసీఐ బ్యాంక్‌పై రూ.97.80 లక్షలు, బ్యాంక్ ఆఫ్ బరోడాపై రూ.61.40 లక్షలు, ఐడీబీఐ బ్యాంక్‌పై రూ.31.8 లక్షలు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రపై రూ.31.80 లక్షల చొప్పున విధించింది. కేవైసీ నిబంధనలు పట్టించుకోకపోవడం, సైబర్ సెక్యూరిటీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్లనే జరిమానా విధించింది.

## రేపు ఉమ్మడి శెట్టి పురస్కారాల సభ

- **'ఇదేమి యుద్ధం' పుస్తకావిష్కరణ**

కమాన్‌చౌరస్తా, మే 2 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిలింభవన్‌లో ఉమ్మడి శెట్టి సాహిత్య పురస్కారాల ప్రదాన సభ ఆదివారం ఉదయం పది గంటలకు తెలంగాణ రచయితల వేదిక, ఉమ్మడి శెట్టి లిటరరీ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌కు చెందిన కవి జనగాని యుగంధర్ కవితా సంపుటి 'ఇదేమి యుద్ధం' పుస్తకాన్ని బహుభాషావేత్త నలిమెల భాస్కర్ ఈ సభలో ఆవిష్కరిస్తారన్నారు. ప్రముఖ కవయిత్రి వైష్ణవి శ్రీ ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహిత్య పురస్కారాన్ని, మరొక కవయిత్రి సుధా మురళి అందుకోనుండగా, రాధేయ కవితా పురస్కారాన్ని యువ కవి నందకిశోర్ ఉమ్మడి శెట్టి సతీశ్‌కుమార్ యువ పురస్కారాన్ని ఆదివారం సభలో అందుకోనున్నారు. గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్, సీవీ కుమార్, ప్రభు, సుంకర గోపాలయ్య, మానస చామర్తి, పెంకులూరు సునీల్, శ్రీరాం పుప్పాల తదితరులు హాజరవుతారని నిర్వాహకులు పేర్కొన్నారు.

## ఎస్‌యూ అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా శ్రీవాణి




శ్రీవాణికి ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ రవికుమార్

కమాన్‌చౌరస్తా, మే 2 : శాతవాహన విశ్వవిద్యాలయం అదనపు పరీక్షల నియంత్రణ (కాన్ఫిడెన్షియల్) అధికారిగా అర్థశాస్త్ర విభాగపు అధిపతి డాక్టర్ కే శ్రీవాణి నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ శ్రీవాణి గతంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలుగా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలిగా, తెలంగాణ విశ్వవిద్యాలయంలో సహాయ ఆచార్యులుగా, శాతవాహన విశ్వవిద్యాలయ గర్ల్స్ హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా, విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం సమన్వయకర్తగా, అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్ పర్సన్‌గా విధులు నిర్వర్తించారు. జాతీయ సేవా పథకంలో అత్యున్నత సేవలు అందించినందుకు జిల్లా స్థాయిలో ఉత్తమ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తగా పూర్వ తెలంగాణ బీసీ, కరీంనగర్ జిల్లా ఉత్తమ మహిళా ఆచార్యులుగా కలెక్టర్ పమేల సత్పతి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. విద్యారంగంలో అత్యున్నత స్థానంలో నిలిచి ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు తెలంగాణ పద్మ రత్న జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యారు. విశ్వవిద్యాలయ కాన్ఫిడెన్షియల్ విభాగానికి అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా నియమించినందుకు ఉపకులపతి ఆచార్య యూ ఉమేశ్‌కుమార్‌కు, రిజిస్ట్రార్ రవికుమార్‌కు, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డీ సురేశ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పరీక్షల కాన్ఫిడెన్షియల్ విభాగానికి సంబంధించిన విషయాలలో పారదర్శకంగా, అంకితభావంతో పరీక్షల నిర్వహణకు తన వంతు కృషి చేస్తానని శ్రీవాణి తెలిపారు.

## విద్యుత్ భద్రతపై అవగాహన

తిమ్మాపూర్ రూరల్, మే 2 : మండలంలోని అలుగునూరులో గల ఏడీఈ కార్యాలయంలో విద్యుత్ భద్రతపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ డీఈ ఎం.తిరుపతి మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాల నివారణకు సిబ్బంది, వినియోగదారులతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యత పాటించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు నివారణ, సేఫ్టీ పై అవగాహన కలిగి, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించే విధంగా అధికారులు సిబ్బందితో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ డీఈ(ఆపరేషన్స్) ఎం తిరుపతి, డీఈ (టెక్నికల్) ఉపేందర్, ఏడిఈటి శ్రీనివాస్, ఏడిఈ శ్రీనివాస్,ఏఈలు వీరాచారి, లక్ష్మణమూర్తి, విద్యుత్ శాఖ ఇంజనీర్లు,లైన్మెన్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 7 నుంచి ఉచిత వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాలు

- **ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5 కేంద్రాల్లో శిక్షణ**




క్రికెట్ సమ్మర్ క్యాంప్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కేడీసీఏ ప్రతినిధులు, కోచ్‌లు

కొత్తపల్లి, మే 2 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వేసవిలో నిర్వహించే ఉచిత క్రికెట్ శిక్షణా శిబిరాలను ఈ నెల 7 నుంచి నిర్వహించనున్నట్లు కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీ ఆగంరావు, ఎన్ మురళీధర్‌రావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని కేడీసీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శిక్షణ శిబిరాల వివరాలను వెల్లడించారు. ఈ శిబిరాలను ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్‌లో 2, గోదావరిఖని 1, జగిత్యాల 1, వేములవాడలో 1 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 13 సంవత్సరాల వయసు నుంచి 23 సంవత్సరాల వయసు గల క్రీడాకారులకు ఈ శిబిరంలో నిపుణులైన కోచ్‌ల సమక్షంలో శిక్షణ ఇప్పించనున్నట్లు చెప్పారు. దీని కోసం ఈనెల 6లోగా ఆసక్తి, అర్హులైన వారు తమ పేర్లను కరీంనగర్‌లోని కేడీసీఏ కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 7 నుంచి ప్రారంభమైన శిక్షణ శిబిరాలు జూన్ 6 వరకు కొనసాగుతాయన్నారు. వేసవి శిక్షణ శిబిరాల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులతో ఈనెల 12 నుంచి ఉమ్మడి జిల్లా టోర్నమెంట్ నిర్వహిస్తామని, అందులో రాణించిన క్రీడాకారులను జూన్‌లో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అబ్బాయిలతో పాటు అమ్మాయిలకు సైతం ప్రతి కేంద్రంలో 100 నుంచి 120 మంది క్రీడాకారులకు శిక్షణలు ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణలను విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్‌లను ప్రదానం చేస్తామన్నారు.

## ప్రణాళికాలోపం.. ప్రజాధనం వృథా

- **అస్తవ్యస్తంగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు**



మంకమ్మతోటలోని పాత లేబర్ అడ్డా చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయగా మూసి ఉన్న రోడ్డు



నగరంలోని ఓ చౌరస్తాల్లో నిరుపయోగంగా ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్

కార్పొరేషన్, మే 2 : కరీంనగర్ నగరపాలక సంస్థలో పరిధిలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ అనేక ప్రాంతాల్లో వినియోగంలోకి రావడం లేదు. పలు ప్రాంతాల్లో పరిస్థితి చూస్తే ఈ సిగ్నల్స్ అవసరమా? అన్న వాదనలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ట్రాఫిక్ అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో ఈ సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఓ ప్రణాళిక లేకుండా ఏర్పాటు చేయడంవల్లే వాటిని పోలీసులు తీసుకోవడం లేదని తెలుస్తోంది.

### అడ్డగోలుగా సిగ్నల్స్ ఏర్పాటు

కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రాజెక్టు కింద సీసీ కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ సిగ్నల్స్, పబ్లిక్ అనౌన్స్‌మెంట్, ఫ్రీ వై ఫై, తదితర వాటి కోసమే రూ.98 కోట్లు కేటాయించారు. కాగా, నగరంలో సుమారు 22 ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. వీటిలో అన్ని చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్‌తోపాటు 85 రెడ్ లైట్ అతిక్రమణ ఐడెంటిఫికేషన్ కెమెరాలు, 174 ఆటోమెటిక్ నంబర్ ప్లేట్ గుర్తింపు కెమెరాలు, 85 వాహన గుర్తింపు కెమెరాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా, ప్రస్తుతం రెండు, మూడు ప్రాంతాల్లో మాత్రమే ఈ ట్రాఫిక్ సిగ్నల్స్ వినియోగానికి పరిమితమయ్యాయి. మిగిలిన ప్రాంతాల్లో ఎక్కగీ వినియోగిస్తున్న దాఖలాలు లేవు. ఇక ఐడెంటిఫికేషన్ కెమెరాలు అయితే ఇప్పటి వరకు వినియోగించిన పాపానపోలేదు. ఇప్పటికి కూడా ట్రాఫిక్ పోలీసులు నిబంధనలను అతిక్రమించిన వారిని గుర్తించేందుకు తమ కెమెరాలనే వినియోగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే అసలు ట్రాఫిక్ సిగ్నల్స్ అవసరం లేదన్నట్లుగానే పోలీసులు క్రమబద్ధీకరణ చేశారు. ప్రణాళిక లేకుండా అన్ని చౌరస్తాల్లో ఈ సిగ్నల్స్ ఏర్పాటు చేయడం కూడా ట్రాఫిక్ సమస్యలను పెంచే విధంగా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, అసలు సరైన ప్రణాళిక లేకుండా అడ్డగోలుగా చౌరస్తాల్లో ఈ సిగ్నల్స్ ఎందుకు ఏర్పాటు చేశారన్న విమర్శలు వస్తున్నాయి. సిగ్నల్స్ పని చేయనప్పుడు రూ.లక్షల్లో వ్యయం చేసి ఇతర కెమెరాలు పెట్టి ఏం ప్రయోజనం అన్న వాదనలు వస్తున్నాయి. ఈ సిగ్నల్స్ ఏర్పాటు చేసి కూడా ఇప్పటికే ఏడాదికి పైగా వినియోగంలోకి మాత్రం రాలేదు. మరోవైపు ఈ కంట్రోల్ సెంటర్ నిర్వాహకులు మాత్రం పనులు పూర్తయ్యాయన్న విధంగానే వ్యవహరిస్తున్నారు.

### సీసీ కెమెరాల ఏర్పాటుపై విమర్శలు..

స్మార్ట్‌సిటీ కింద చేపడుతున్న కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు పూర్తిగా అవినీతిమయంగా మారాయన్న విమర్శలు వస్తున్నాయి. పూర్తిస్థాయిలో టెక్నికల్, ఎలక్ట్రికల్ పరికరాలు వాడుతారని, దీనిపై పెద్దగా ఎవరూ పట్టించుకోరన్న ఆలోచనతోనే ఈ పనులు చేసినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో భవన నిర్మాణానికే రూ.16.50 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అలాగే, పరికరాల కోసం రూ.98 కోట్లు కేటాయించారు. దీనిలో 300లకు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఇప్పటివరకు వీటిల్లో సగం కూడా పూర్తిస్థాయిలో ఫిట్టింగ్ చేయలేదన్న విమర్శలు ఉండగా.. ఏర్పాటు చేసినవి కూడా సరైన చౌరస్తాల్లో కాకుండా నేతలు, తమకు అనుయాయులు ఉన్న ప్రాంతాలు.. చిన్న చిన్న వీధుల్లో ఈ కెమెరాలను ఏర్పాటు చేశారన్న విమర్శలు ఉన్నాయి. మూలకు ఉన్న ఇళ్ల ముందు, డెడ్ ఎండ్ వీధుల వెంట ఏర్పాటు చేయడంలో వారికి ఉన్న ప్రాధాన్యత ఏంటో అర్థం చేసుకోవచ్చు.

### ట్రాఫిక్ సిగ్నల్స్ వినియోగంలోకి వచ్చేనా ?

ఇక నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు పేరుతో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందన్న విమర్శలు వస్తున్నాయి. ఈ సిగ్నల్స్ వద్ద సిగ్నల్స్ బ్రేక్ చేస్తే ఫొటోలు తీసే కెమెరాలు, జీబ్రా లైన్ క్రాస్ చేస్తే ఫొటోలు తీసే కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని నగరపాలక అధికారులు చెబుతున్నారు. అయితే, మరోవైపు అనేక ప్రాంతాల్లో ఈ సిగ్నల్స్ అవసరమే లేదన్నట్లుగా పోలీసులు వర్గాలు పేర్కొంటున్నాయి. నగరంలోని పాత లేబర్ అడ్డా చౌరస్తాలో నగరపాలక అధికారులు ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. అయితే, అక్కడ ప్రస్తుతం పోలీసులు దానిని మూసి వేసి ముందుకు వెళ్లి యూటర్న్ ద్వారా ట్రాఫిక్ మళ్లించారు. దీంతో ప్రస్తుతం అక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనదారులు సులువుగా వెళ్లిపోతున్నారు. ఒక వేళ అక్కడ సిగ్నల్స్‌ను వినియోగంలోకి తీసుకువస్తే ట్రాఫిక్ సమస్యలు వచ్చే అవకాశం కనిపిస్తుంది. అసలు అవసరం ఉన్నా లేకున్నా సిగ్నల్స్ ఎందుకు ఏర్పాటు చేశారన్న ప్రశ్న ఇప్పుడు వ్యక్తమవుతోంది.


## ఫార్మసిస్టుల నుంచి ఫార్మసీ ఆఫీసర్లుగా..



జీవో కాపీని సూపరింటెండెంట్‌కు అందిస్తున్న ఫార్మసీ ఆఫీసర్లు

విద్యానగర్, మే 2 : ఫార్మసిస్టుల హోదా నుంచి ఫార్మసీ ఆఫీసర్లుగా మారిన సందర్భంగా శుక్రవారం జీజీహెచ్ కరీంనగర్‌లో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గుండా వీరారెడ్డికి జీవో కాపీని సమర్పించి పలువురు ఫార్మసిస్టులు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి తూం రామారావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చేసిన పోరాటాలను గుర్తించి ప్రభుత్వం హోదా కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఇది తమ యూనియన్‌కు గర్వకారణమన్నారు. డాక్టర్ వీరారెడ్డి ఫార్మసీ ఆఫీసర్లకు స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ ఆఫీసర్లు ఇక్బాల్ అహ్మద్, సుధాకిరణ్, లక్ష్మీదేవి, నర్సింహనాయక్, నాగరాజు, శేషగిరిధర్‌బాబు, శారద, శ్రీదేవి, స్వప్న, రేణుక, అభిలాష్, ప్రసాద్, అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలకు పరిష్కార వేదిక శుక్రవారం సభ



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి సరస్వతి

కలెక్టరేట్/ విద్యానగర్, మే 2 : ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న శుక్రవారం సభ పరిష్కార వేదికగా నిలుస్తుందని జిల్లా సంక్షేమాధికారి ఎం సరస్వతి తెలిపారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని మార్కండేయనగర్‌లో గల అంగన్‌వాడీ 2 కేంద్రంలో నిర్వహించిన శుక్రవారం సభలో ఆమె మాట్లాడారు. ప్రతి మహిళ సభలో పాల్గొని, తాము ఎదుర్కొంటున్న ఆరోగ్య, కుటుంబ సమస్యలు అధికారులకు చెప్పుకోవాలని సూచించారు. సంబంధిత సిబ్బంది వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తారని, దీంతో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగి మానసిక ఆందోళన తొలుగుతుందన్నారు. ఆరోగ్య సమస్యలపై అన్ని ప్రభుత్వ దవాఖానలు, ఆరోగ్య కేంద్రాల్లో 50 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్బన్ సీడీపీవో కే సబిత మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, వైద్యాధికారి డాక్టర్ సపూర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వప్న, బిసి సతీష్, ఎంఎస్‌కె.శ్రీలత, ఐసిపిఎస్ కవిత, అంగన్‌వాడీ టీచర్ బి.రమణతోపాటు గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.